టెట్‌కు 332 మంది హాజరు

38 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (ఏపి టెట్-2024) ఎనిమిదో రోజు గురువారం ప్రశాంతంగా సాగాయి. వట్లూరులోని సిద్దార్థ క్వెస్ట్ సిబిఎస్ఇ పాఠశాలలో ఉదయం 9:30 నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 185 మందికి 165 మంది హాజరయ్యారు. 20 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 2:30 నుంచి ఐదు గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 185 మందికి 167 మంది హాజరయ్యారు. 18 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. దసరా సందర్భంగా 11, 12 తేదీల్లో పరీక్షలు నిర్వహించడం లేదని, తిరిగి 13వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు.

తేమ దోపిడీకి అడ్డుకట్ట పడేనా..!

గత ప్రభుత్వ హయాంలో మిల్లర్ల దోపిడీకి ధాన్యం రైతులు విలవిల

తేమశాతం పేరుతో రైతుల నుంచి సొమ్ము వసూలు

ధాన్యం కొనుగోలులో రైతుల ప్రధాన సమస్య తేమ నిర్ధారణే

ఆర్‌బికె అధికారులు నిర్ధారించిన తేమశాతాన్ని పట్టించుకోని మిల్లర్లు

కూటమి ప్రభుత్వంలోనైనా పరిస్థితి మారేనా అంటూ రైతుల్లో చర్చ

రెండు జిల్లాల్లో ఖరీఫ్‌లో 10.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రణాళికలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ మాసూళ్లు ప్రారంభమయ్యాయి. మెట్టప్రాంతంలో ధాన్యం మాసూళ్లు జరుగుతున్నాయి. ఈ నెల 15వ తేదీ నుంచి ధాన్యం కొనుగోలుకు అధికారులు సిద్ధమవుతున్నారు. రైతుల్లో నెలకొన్న అనుమానాలకు మాత్రం అధికారుల నుంచి ఇప్పటి వరకూ స్పష్టమైన సమాధానం దక్కని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో తేమశాతం పేరుతో మిల్లర్లు సాగించిన దోపిడీని ఏవిధంగా అరికడతారో స్పష్టత ఇవ్వడం లేదు. ఆర్‌బికె అధికారులు నిర్ధారించిన తేమశాతాన్ని పట్టించుకోకుండా మిల్లర్లు ఇష్టానుసారంగా తేమశాతం నిర్ధారించి డబ్బు వసూలు చేసిన ఘటనలను రైతులు మరిచిపోలేక పోతున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వంలోనైనా ధాన్యం తేమశాతం నిర్ధారణపై ఏవిధంగా ముందుకు సాగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రైతుసేవా కేంద్రాల అధికారులు నిర్ధారించిన తేమశాతం అంతిమమా.. లేక మిల్లర్లు నిర్ధారించిన తేమశాతాన్ని పరిగణనలోకి తీసుకుంటారా అనేది అధికారులు స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు నాలుగున్నర లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఏలూరు జిల్లాలో 5.60 లక్షల మెట్రిక్ టన్నులు, పశ్చిమగోదావరి జిల్లాలో 5.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏలూరు జిల్లాలో 247, పశ్చిమలో 264 రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు జిల్లాలవ్యాప్తంగా 10.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానుందని అంచనా. ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులు ఎన్నో ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని పంట సాగు చేశారు. భారీ వర్షాలకు నాట్లు, నారుమడులు దెబ్బతినడంతో అదనపు పెట్టుబడులు పెట్టాల్సి వచ్చింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు దక్కితేనే కొంతలోకొంత ఊరట కలుగుతుంది. అన్నదాతకు మద్దతు ధర దక్కాలంటే మిల్లర్ల దోపిడీని అరికడితేనే సాధ్యం.

రైతుసేవా కేంద్రాల సిబ్బంది నిర్ధారించిన తేమశాతం ప్రకారమే ధాన్యం తీసుకోవాలి

కె.శ్రీనివాస్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి

ధాన్యం కొనుగోలులో తేమశాతం పేరుతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆర్‌బికె సిబ్బంది నిర్ధారించిన తేమశాతాన్ని మిల్లర్లు పరిగణనలోకి తీసుకోకుండా రైతుల నుంచి సొమ్ము వసూలు చేసేవారు. ధాన్యం కొనుగోలు చేస్తున్న రైతుసేవా కేంద్రాల సిబ్బంది నిర్ణయించిన తేమశాతం ప్రకారమే మిల్లర్లు ధాన్యం తీసుకోవాలి. మిల్లర్లు డబ్బు వసూలు చేసే విధానాన్ని రద్దు చేయాలి. రైతులకు మద్దతు ధర అందేవిధంగా చర్యలు తీసుకోవాలి.

తేమశాతం నిర్ధారణపై స్పష్టమైన ఆదేశాలిస్తారా..?

గత ప్రభుత్వ హయాంలో ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు సాగింది. ఆర్‌బికె అధికారులు నిబంధనలకు అనుగుణంగా ధాన్యంలో 17 శాతంలోపు తేమ ఉందని నిర్ధారించి ధాన్యాన్ని మిల్లులకు తరలించేవారు. మిల్లర్లు మాత్రం తేమ 19, 20 శాతం ఉందంటూ ధాన్యాన్ని దిగుమతి చేసుకోకుండా నిలిపేసేవారు. ధాన్యానికి అందించే మద్దతు ధర ప్రాతిపదికన అదనంగా చెప్పిన తేమ పాయింట్లకు డబ్బు వసూలు చేసేశారు. ఫోన్‌పే ద్వారా డబ్బు చెల్లించిన తర్వాతే ధాన్యం దిగుమతి చేసుకునేవారు. దీంతో మిల్లుల వద్ద ధాన్యం రెండు, మూడు రోజులు ఉండిపోయేవి. దీంతో వాహన యజమానులు అదనంగా కిరాయి వసూలు చేసేవారు. అటు తేమపేరుతో, ఇటు రవాణా ఛార్జీల పేరుతో రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. ఆర్‌బికె అధికారులు నిర్ధారించిన తర్వాత తేమశాతంలో తేడా ఉందంటూ మిల్లర్లు డబ్బు వసూలు చేయడంపై అప్పట్లో పెద్దఎత్తున రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అయినా ప్రభుత్వం సమస్యను పరిష్కరించలేదు. ప్రభుత్వం మారింది. ఇప్పుడు రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతుసేవా కేంద్రాల్లోని సిబ్బంది తేమశాతం నిర్ధారించిన తర్వాత, మిల్లర్లు గతంలో మాదిరిగా తేమశాతం ఎక్కువగా ఉందని చెబితే రైతులు ఏం చేయాలో అధికారులు చెప్పాల్సి ఉంది. మిల్లర్లు డబ్బు చెల్లించాలని అడిగితే ఎవరిని సంప్రదించాలో స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం 75 కిలోల బస్తాకు రూ.1740 వరకూ అందాలి. మద్దతు ధర అందేవిధంగా అధికారులు చర్యలు తీసుకుంటేనే రైతులకు మేలు జరుగుతుంది. గత ప్రభుత్వ హయాంలో తేమశాతం, తూకంలోనూ తేడా పేరుతో మిల్లర్లు రైతుల నుంచి భారీగా డబ్బు వసూలు చేశారు. అధికారులు ఈ సమస్యలపై దృష్టి సారిస్తే చాలని అన్నదాత కోరుతున్నాడు.



మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారధి

హామీలన్నీ నెరవేరుస్తున్నాం

మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రజలు తమకు అందించిన అఖండ విజయాన్ని బాధ్యతగా స్వీకరించి పేదప్రజల సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. నూజివీడు మండలంలో పల్లెర్లమూడి రామాలయం నుండి శోభనాపురం గ్రామానికి సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం సాయంత్రం మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ ప్రజలు తమపై నమ్మకం ఉంచి అందించిన విజయాన్ని బాధ్యతగా భావిస్తున్నామన్నారు. ప్రజల ఆశలు , ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ఐదు ప్రధానాంశాలపై చంద్రబాబు సంతకాలు చేశారని, వాటిని పూర్తిస్థాయిలో నెరవేరుస్తున్నారని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం త్వరలో కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

భూసేకరణపై దృష్టి సారించాలి

అధికారులకు కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించి, దానికి సంబంధించిన నివేదికను త్వరితగతిన అందజేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూసేకరణకు సంబంధించిన జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రూప్ హౌసింగ్‌కు, జంగారెడ్డిగూడెంలో పానీయాల ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు, జీలుగుమిల్లి మండలంలో నౌకాదళ విభాగానికి, నూజివీడు నుంచి సుంకొల్లు రింగ్ రోడ్డు కోసం, పరిహార అటవీ నిర్మూలన బ్లాక్స్, జాతీయ రహదారుల కోసం భూసేకరణ, కోర్టు కేసులు, తాడిపూడి లిఫ్టు ఇరిగేషన్‌లో మట్టి సమస్యలు, చింతలపూడి మండలం రేచర్ల గ్రామంలో నేరుగా కొనుగోలు కింద బెల్‌మౌత్‌ల కోసం అదనపు విస్తీర్ణం కోసం, బిఎస్ఎన్ఎల్ స్ట్రక్చర్‌కు సంబంధించిన భూముల అంశాలు, మోడల్ పార్క్‌కు సంబంధించిన భూసేకరణ, ఎపి ట్రాన్స్‌కో, పవర్ గ్రిడ్, ఎలక్ట్రికల్ టవర్ల మార్పు, ఏలూరు ఫిషరీష్ జెడికి సంబంధించిన ప్రభుత్వ భూముల కేటాయింపు, పరిశ్రమల శాఖ భూమి కేటాయింపు, ఎపిసిఆర్‌డిఎ భూమి కేటాయింపు, మత్స్యశాఖ భూమికేటాయింపు తదితర ప్రభుత్వ భూములకు సంబంధించిన విషయాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. దీనికి సంబంధించిన నివేదికలను వారం రోజుల్లోగా అందజేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, ఆర్అండ్‌బి ఎస్ఇ జి.జాన్‌మోషే, జిల్లాలోని ఆర్‌డిఒలు, పశు సంవర్ధక, పరిశ్రమలు, విద్యుత్, గృహనిర్మాణ, జాతీయ రహదారులు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

డిపిఒకు ఇ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల వినతి

ప్రజాశక్తి - భీమడోలు



డిపిఒను కలిసిన ఇ-పంచాయతీ ఆపరేటర్లు

గ్రామ పంచాయతీల్లో పనిచేసే ఇ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల సంక్షేమానికి సహాయ సహకారాలు అందజేయాలని జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధకు ఎపి ఇ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్స్ సొసైటీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. నూతనంగా ఉద్యోగ బాధ్యతలను స్వీకరించిన జిల్లా పంచాయతీ అధికారిని సంఘ అధ్యక్షులు బిఎన్.దుర్గారావు ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పంచాయతీ అధికారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పంచాయతీరాజ్ కమిషనర్ (గుంటూరు) తమ వేతనాలను రూ.15 వేల నుంచి రూ.18,500కు పెంచుతూ అనుమతులు ఇచ్చారన్నారు. మంజూరు పత్రాలు కిందస్థాయి వరకు చేరలేదని డిపిఒ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించి వేతనాల పెంపు అమలుకు చర్యలు తీసుకోవాలని సొసైటీ కార్యవర్గ సభ్యులు కోరారు. అనంతరం వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ ఉమ్మడి జిల్లా కోశాధికారి కె.లావణ్య, కార్యదర్శులు ఆదిత్య, వలీ బాబా, ధర్మ తేజ పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 4,275 దరఖాస్తులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నూతన మద్యం షాపులకు గురువారం సాయంత్రం 7:30 గంటల వరకు జిల్లావ్యాప్తంగా 4,275 దరఖాస్తులు వచ్చాయి. బుధవారం రాత్రి 9 గంటల సమయానికి మొత్తం 3,854 దరఖాస్తులురాగా గురువారం ఒక్కరోజు 421 దరఖాస్తులు వచ్చాయి. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు దరఖాస్తుల ద్వారా రూ.85.5 కోట్లు ఆదాయం వచ్చింది. ఎక్సైజ్ స్టేషన్లవారీగా చూస్తే ఏలూరు స్టేషన్ పరిధిలో 343, చింతలపూడిలో 643, భీమడోలు పరిధిలో 959, జంగారెడ్డిగూడెం స్టేషన్ పరిధిలో 818, పోలవరంలో 498, నూజివీడు పరిధిలో 559, కైకలూరు స్టేషన్ పరిధిలో 455 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో పట్టణాలు, నగరాలకన్నా గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. ఏలూరు కార్పొరేషన్ పరిధిలో 21 మద్యం షాపులు కేటాయించగా 190 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. భీమడోలు మండలంలో కేవలం ఏడు షాపులకు 337 దరఖాస్తులు వచ్చాయి. జంగారెడ్డిగూడెం పట్టణంలో ఏడు షాపులకు 307 దరఖాస్తులు వచ్చాయి. ఇక జిల్లాలోని ప్రముఖ క్షేత్రమైన ద్వారకాతిరుమల మండలంలో ఐదు షాపులకు 263 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో అత్యధికంగా భీమడోలు మండలంలో ఏడు దుకాణాలకు 337 దరఖాస్తులు రాగా అత్యల్పంగా ఏలూరు రూరల్ మండలం, పెదపాడు మండలంలో ఐదేసి దుకాణాలకు 34 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. ఎక్సైజ్ స్టేషన్ల వారీగా చూస్తే ఏలూరు స్టేషన్ పరిధిలో అత్యల్పంగా 343 దరఖాస్తులు వస్తే భీమడోలు స్టేషన్ పరిధిలో అత్యధికంగా 959 దరఖాస్తులు వచ్చాయి. శుక్రవారం సాయంత్రం వరకు సమయం ఉండటంతో ఈ దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

వినతులు స్వీకరిస్తున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి

చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని, ఆయన అడుగుజాడల్లోనే చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ప్రజలతో ఎంఎల్ఎ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలన్నారు. మళ్లీ సమావేశం నాటికి ఈ రోజు వచ్చిన సమస్యలన్నింటినీ పరిష్కరించాలని, దీనిపై అధికారులంతా సమన్వయంతో పని చేయాలని అన్నారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి సుమారు ఏడొందల వినతులు వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చాయని ఎంఎల్ఎ చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, కొండ్రు దేవా, మాటూరి వెంకటరామయ్య, మధుబాబు, ఎంపిపి రాంబాబు, తహశీల్దార్ ప్రమద్వర, ఎంపిడిఒ మురళీకృష్ణ, నగర పంచాయతీ కమిషనర్ పావని పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో శంకుస్థాపనలు

ప్రజాశక్తి - దెందులూరు

ఎన్ఆర్ఇజిఎస్ మెటీరియల్ కాంపోనెంట్‌లో మంజూరైన పనులకు సంబంధించి శంకుస్థాపన వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 14, 15 తేదీల్లో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌చే శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కె.శ్రీదేవి తెలిపారు.

స్థానిక లారీల్లోనే ఇసుక రవాణా చేయాలి

సిఐటియు

ప్రజాశక్తి - కుక్కునూరు

కుక్కునూరు మండలంలోని ఇబ్రహీంపేట ఇసుక ర్యాంపు నుండి జరిగే ఇసుక సరఫరాను లోకల్ లారీలతో రవాణా చేయాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం లారీ అండ్ మినీ వ్యాన్ టాటా ఏస్, బొలోరో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ సమావేశం నిర్మల వెంకటేశ్వర్లు అధ్యక్షతన లారీ యూనియన్ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో సాయికిరణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక ర్యాంపుల వద్ద మండలంలోని లారీ కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, స్థానికంగా ఉన్నటు వంటి లారీలకు కిరాయిలు లేక అవస్థలు పడుతుంటే స్థానిక ఇసుక ర్యాంపులలో బయట నుండి లారీల ద్వారా ఇసుక రవాణా చేయడంతో స్థానికులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్థానిక లారీలకు ఇసుక రవాణా అప్పగించాలని, తద్వారా ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పలుమార్లు మండలంలోని అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని, రానున్న రోజుల్లో ఇసుక రవాణా చేసేందుకు స్థానిక లారీలకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ట్రాన్స్‌పోర్టు వర్కర్లందరినీ సమీకరించి పోరాటానికి సిద్ధమవుతామని, దానికి ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ వలీపాషా, సభ్యులు ఎల్లయ్య, కట్టబోయిన మల్లేష్, రవి, కాశీ, ఓగిరాల నాగరాజు, అంగిరేకుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భీమవరం పురపోరు ఎప్పుడో..!

మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఇప్పట్లో కష్టమే

గ్రామాల విలీన ప్రతిపాదనే అడ్డంకి

కార్పొరేషన్ కోసం ఎదురుచూపేనా?

కోర్టు కేసులు పరిష్కారమైతేనే ఎన్నికలు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం మున్సిపల్ ఎన్నికలు కలలానే మిగిలిపోతున్నాయి. పట్టణంలో సమీప గ్రామాల విలీనమే దీనికి అవరోధంగా మారింది. ఈ సమస్యలు కోర్టులో ఉండటంతో ఇటు విలీన ప్రక్రియ జరగదు.. అటు ఎన్నికలు జరగవు అన్నట్లుగా పరిస్థితి తయారైంది. దీంతో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఇప్పట్లో కష్టంగానే కన్పిస్తోంది. అయితే భీమవరం కార్పొరేషన్ అవుతుందనే ఆశ కూడా ఎదురుచూపుగానే మిగిలింది. అయితే అటు కోర్టులో ఉన్న కేసులు పరిష్కారం కావడమే కాకుండా ఇటు విలీన ప్రక్రియ కూడా సజావుగా సాగితేనే మున్సిపల్ ఎన్నికలు జరిగేందుకు ఆస్కారం లభిస్తుంది. లేకపోతే లేనట్లే. ఇదే పరిస్థితి జిల్లాలోని తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు మున్సిపాల్టీల్లోనూ నెలకొంది.

భీమవరంలో మున్సిపల్ ఎన్నికలకు బ్రేక్ పడిన తర్వాత నుంచి ఇప్పటి వరకు రెండు సార్వత్రిక ఎన్నికలు జరిగినప్పటికీ మున్సిపల్ ఎన్నికలు మాత్రం జరగలేదు. భీమవరం పట్టణంలో సమీప గ్రామాల విలీనమే ఎన్నికలకు అవరోధంగా మారింది. గ్రామాల విలీనం ప్రతిపాదనకు 1997 నుంచి చుక్కెదురవుతూనే ఉంది. అయినా భీమవరం పట్టణంలో సమీప గ్రామాలను విలీనం చేసేందుకు గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2019 జూన్ 19న గత మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం ముగిసింది. ఇక మున్సిపల్ ఎన్నికలకు అందరూ సిద్ధమయ్యే తరుణంలో గ్రామాల విలీనానికి 2020 డిసెంబర్‌లో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. తాడేరు, చినఅమిరం, రాయలం, కొవ్వాడ అన్నవరం గ్రామాలను విలీనం చేస్తూ భీమవరం పట్టణంలో వార్డుల విభజన, జనాభా ప్రాతిపదికన ఎన్నికలకు రిజర్వేషన్లను నిర్ణయించారు. గతంలో ఉన్న 39 వార్డుల సంఖ్యను పెంచకుండా విలీనం ప్రతిపాదిత గ్రామాలను ఆయా వార్డుల్లో చేర్చారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బిసి మహిళకు రిజర్వ్ చేసినట్లు స్పష్టం కావడంతో తొలిగా జనసేన అభ్యర్థిని కూడా ప్రకటించారు. ఈ నేపథ్యంలో చినఅమిరం నుంచి కొందరు స్థానికులు విలీనానికి అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ఇదిలా ఉండగా గత కలెక్టర్ పి.ప్రశాంతి మిగిలిన మూడు పంచాయతీల రికార్డులను మున్సిపాలిటీకి అప్పగించాలని కార్యదర్శులను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కొవ్వాడ అన్నవరం, రాయలం గ్రామాల నుంచి కొందరు స్థానికులు హైకోర్టును ఆశ్రయించారు. తాడేరు గ్రామస్తులు మాత్రం మౌనం వహించారు. దీంతో గత ఐదేళ్లుగా భీమవరం మున్సిపాల్టీలో గ్రామాల విలీన ప్రతిపాదనకు బ్రేక్ పడింది. గత 17 ఏళ్లుగా మాస్టర్ ప్లాన్ లేని భీమవరం పట్టణానికి 2023లో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ విలీన గ్రామాలతో కలిపి మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ కూడా విడుదల చేసింది. అయితే గ్రామాల విలీనం, ఎన్నికలు, మాస్టర్ ప్లాన్ ప్రశ్నార్థకంగా మిగిలిపోయాయి.

ఎన్నికలు ప్రశ్నార్థకమే

కార్పొరేషన్ లేదా మున్సిపాల్టీ స్థాయిలో ఎన్నికలు ఇప్పట్లో జరుగుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది. గ్రామాల విలీనం సమస్య కోర్టులో ఉండటం ప్రధాన కారణంగా కన్పిస్తోంది. ఆ గ్రామాలు కలవకుండా జనాభా సంఖ్య, విస్తీర్ణం పెరగదు. కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేయాలంటే ఆ రెండు అంశాలు కీలకమే. ఇక కోర్టులో కేసులు ఉపసంహరించుకోవడం అంత సులభమైన విషయం. జిల్లాలో మరో మూడు మున్సిపాల్టీలు గ్రామాల విలీనం సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఇక విలీన ప్రతిపాదిత గ్రామాల జనాభా ఆధారంగా రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేశారు. వీటితోపాటు ఎన్నో సాంకేతిక సమస్యలు ఉన్నాయి. ఈ అంశాలన్నింటినీ పరిశీలిస్తే భీమవరం మున్సిపల్ ఎన్నికలు ఇప్పట్లో జరిగే అవకాశం కన్పించడం లేదు. దీంతో పట్టణ ప్రజలు మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయా.. కొత్త పాలకవర్గం ఎప్పుడు కొలువుదీరుతుందా.. తమ సమస్యలు పరిష్కారానికి ఎప్పటికి నోచుకుంటాయోనని ప్రశ్నార్థకంగా ఎదురుచూస్తున్నారు.

మున్సిపల్ మంత్రి వద్దకు భీమవరం మున్సిపాల్టీ సమస్య

ఇటీవల భీమవరం పర్యటనకు వచ్చిన మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) నివాసానికి విచ్చేశారు. ఈ నేపథ్యంలో టిడిపి కూటమి నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. దీంతో భీమవరం మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన అంశాన్ని నేతలు మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మున్సిపల్ ఎన్నికల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. భీమవరం మున్సిపాల్టీ ఇప్పటికిప్పుడు కార్పొరేషన్ కావడం కష్టమని, స్థానిక నాయకులు అంతా చర్చించుకుని ఓ నిర్ణయానికి వస్తే ఎప్పుడైనా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని మంత్రి సంకేతాలు ఇచ్చినట్లు తెలిసింది. భీమవరం మున్సిపాల్టీని కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేస్తామంటే విలీనానికి అంగీకరిస్తామని, కేసుల ఉపసంహరణకు ముందుకొస్తామని కొంతమంది మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

రతన్ టాటా మృతి తీరని లోటు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రముఖ వ్యాపార వేత్త రతన్ టాటా మృతి దేశానికి, పారిశ్రామిక రంగానికి తీరని లోటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విలువలతో కూడిన వ్యాపారంతో రతన్ టాటా ఒక పెద్ద బ్రాండ్‌ను సృషించారని కొనియాడారు. సంపదను సృష్టించడమే కాకుండా ఆ సంపదను సమాజంలో అన్ని వర్గాలకు చేరేలా రతన్ టాటా ఎంతో కృషి చేశారన్నారు. తన ఆదాయంలో 60 నుంచి 65 శాతం వరకు వివిధ దాతృత్వ కార్యక్రమాల కోసం ఉదారంగా దానం చేసి ప్రజల హృదయాల్లో సుస్థిరంగా నిలిచిపోయారన్నారు. టాటా సంస్థల అధినేత రతన్ టాటా మృతి పట్ల ఎపి ఎన్‌జిఒస్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు తీవ్ర సంతాపం తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రతన్ టాటాతో పాటు వారి వంశీకులందరూ భారత దేశ ఆర్థిక పరిపుష్టికి కృషి చేసి ఎన్నో పరిశ్రమలు స్థాపించి, కొన్ని లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి కల్పించారని తెలిపారు.. రతన్ టాటాకు భారతదేశ అత్యున్నత పురస్కారం భారతరత్నను కేంద్రం ఇవ్వాలని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి

సామాజిక సేవా కార్యక్రమాలపై చర్చ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని జిల్లా రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి అధ్యక్షతన గురువారం మేనేజింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించే రక్తదాన శిబిరాలు, తలసేమియా చిన్నారులకు జరిగే రక్త మార్పిడి చికిత్స, ఉచిత వైద్య శిబిరాలు, గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో పంపిణీ చేస్తున్న టార్పాలిన్లు, కిచెన్ సెట్లు, హైజీన్ కిట్లు, దుప్పట్లు వంటి సహాయక సామగ్రి గురించి, భవిష్యత్తులో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో చేసే సామాజిక సేవా కార్యక్రమాల వంటి అంశాలపై చర్చించారు. పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా మృతి పారిశ్రామిక రంగానికే కాకుండా యావత్ భారతదేశానికి తీరని లోటన్నారు. ఆయన సంపాదించిన ఆస్తిలో ఎక్కువ శాతం సామాజిక సేవా కార్యక్రమాలకే వినియోగించిన గొప్ప మానవతమూర్తి రతన్ టాటా అని అన్నారు. అనంతరం కృష్ణారెడ్డి, రెడ్ క్రాస్ కమిటీ సభ్యులు, సిబ్బంది రతన్ టాటాకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం, ట్రెజరర్ రేవూరి శివప్రసాద్, డాక్టర్ వరప్రసాదరావు, కమిటీ సభ్యులు ఆర్ఎన్ఆర్.బుజ్జి, బిఆర్‌సి హెచ్.నారాయణ, టి.రామారావు, పాలడుగు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

వరి పొలాల పరిశీలన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని పొంగుటూరు, కన్నాయ్యగూడెం గ్రామాల్లోని వరి పొలాల్లో ఆకు ముడత, ఎండాకు తెగుళ్ళ వ్యాపిస్తున్న నేపథ్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు పొలాలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు డికె.ఫణికుమార్ డాక్టర్ పివి.రమణ పొలాలను సందర్శించి పంట పరిస్థితిని అంచనా వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆకు ముడత, ఎండాకు తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఒ చెన్నకేశవులు, విఎఎ షేక్ నసీమ, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కోళ్ల లారీ ఢీకొని భవాని భక్తుడు మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

కోళ్ల లారీ ఢీకొని విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి పాదయాత్రగా వెళ్తున్న భవానీ భక్తుడు మృతి చెందాడు. ఈ ఘటన జాతీయ రహదారి ఉంగుటూరు మండలం కైకరం వద్ద గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. చేబ్రోలు ఎస్ఐ సూర్యభగవాన్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజమమేంద్రవరం రూరల్ రాజవోలు గ్రామానికి చెందిన వాసపు వెంకట మణికంఠసాయి (21) మిత్ర బృందంతో కలిసి నడుచుకుంటూ విజయవాడ బయలు దేరారు. కైకరం బిసి కాలనీ సమీపంలో చేబ్రోలు నుంచి భీమడోలు వైపు వెళ్లే కోళ్ల లారీ మణికంఠసాయిని వెనుకనుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన మణికంఠసాయిని రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

చావలిపాడులో డిఎస్‌పి విచారణ

ప్రజాశక్తి - మండవల్లి

కులం పేరుతో దూషించిన కేసుపై ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్ విచారణ చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చావలిపాడులోని గాంధీ నగర్‌లో విసనపల్లి మేరీ ఆమె భర్త వెంకటేశ్వరరావు నివాసం ఉంటున్నారు. అదే ప్రాంతంలో అబ్దుల్ గఫార్ నివాసం ఏర్పాటు చేసుకుని మూడు నెలల నుంచి నివాసం ఉంటున్నాడు. అయితే డ్రైయినేజీ, వ్యక్తిగత కుళాయిల విషయంలో ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఘర్షణ తారాస్థాయికి చేరడంతో గఫార్ అతని కుమారుడు, కుమార్తె కలిసి కోపంలో వెంకటేశ్వరరావుపై దౌర్జన్యానికి దిగారు. వెంకటేశ్వరరావు భార్య మేరీ అక్కడకు రావడంతో ఆమెను కూడా కొట్టడంతో పాటు కులం పేరుతో దూషించారని భార్యాభర్తలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్‌కు సమాచారం అందించడంతో ఆయన గ్రామం చేరుకుని విచారణ చేపట్టారు. ఆయనతో పాటు సిఐ రవికుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నగరంలో చోరీ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఇంటికి తాళం వేసి కుమార్తె ఇంటికి వెళ్లి వచ్చేటప్పటికి దొంగలు ఆ ఇంటి తాళాలు పగులగొట్టి నగదు అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు చోడిదిబ్బలో రెళ్ల మోహనరావు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల తొమ్మిదో తేదీ రాత్రి మోహన్‌రావు వాచ్‌మెన్ ఉద్యోగానికి వెళ్లగా అతని భార్య రేణుకాదేవి ఏలూరు కొత్తపేటలో ఉన్న తన కుమార్తె ఇంటికి వెళ్లింది. గురువారం ఉదయం ఇంటికి వచ్చేటప్పటికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువా కూడా పగులగొట్టి ఉంది. బీరువాలోని రూ.30 వేల నగదు అపహరణకు గురైనట్లుగా కుటుంబ సభ్యులు గుర్తించి ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని యర్రంపల్లిలో పేకాటస్థావరంపై చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు గురువారం తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఆ వంతెనపై ప్రయాణం.. ప్రమాదకరం..!

శిథిలావస్థకు కురెళ్లగూడెం వంతెన

ప్రమాదాలు చోటు చేసుకుంటున్న వైనం

అధికారులు స్పందించాలని ప్రజల వేడుకోలు

కురెళ్లగూడెం వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం

ప్రజాశక్తి - భీమడోలు

ఏలూరు కాలువపై కురెళ్లగూడెం గ్రామపంచాయతీని కలుపుతూ ఏర్పాటుచేసిన వంతెనపై ప్రయాణం ప్రమాద భరితంగా మారింది. దీని పక్కగానే ఆధునీకరించిన జాతీయ రహదారి ఉండటం, దీనికి అదనంగా ఇటీవల కాలంలో కొల్లేరు ప్రాంతంలో ఆక్వా రంగం విస్తరించడంతో సుమారు 20 నుంచి 30 టన్నుల లోడులతో చేపల మేత లారీలు, ఆక్వా ఉత్పత్తులు నిరంతరంగా రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఈ వంతెనపై ప్రయాణం మరింత ప్రమాద భరితంగా మారింది. సుమారు పది టన్నులు లేదా ఆపై కొద్దిపాటి లోడులతో ప్రయాణానికి మాత్రమే ప్రత్యేకించిన వంతెన మీదుగా సామర్థ్యానికి మించి లోడులతో వాహనాలు ప్రయాణించటంతో వంతెన శిథిలావస్థకు చేరింది. నిర్మాణం జరిగిన 35 సంవత్సరాల లోగానే వంతెన కూలిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇదే జరిగితే కురెళ్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని రెండు ఆవాస ప్రాంతాల మధ్య రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడింది. ఇటీవల కాలంలో చేపల చెరువులకు విద్యుత్ కనెక్షన్‌లను ఇచ్చేందుకు సిమెంటు స్తంభాల లోడుతో వస్తున్న లారీ, వంతెన మీదుగా ప్రయాణించేందుకు ప్రయత్నం చేస్తున్న క్రమంలో అదుపుతప్పింది. వంతెనకు జాతీయ రహదారిని అనుసంధానం చేస్తూ ఏర్పాటుచేసిన రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటం, రోడ్డు పాడైన కారణంగా లారీకి చెందిన ముందు భాగం కాలువలోకి, వెనుక భాగం జాతీయ రహదారి మీదకు అడ్డంగా తిరిగిన కారణంగా ప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో జారిన విద్యుత్ స్తంభాలు జాతీయ రహదారిపై ప్రయాణం చేసేందుకు బస్సుల కోసం ప్రయాణికులు వేచి ఉండే ప్రాంతంలో పడ్డాయి. ఆ సమయంలో ప్రయాణికులు లేని కారణంగా పెద్ద ప్రమాదం తప్పింది. దీంతో స్పందించిన స్థానికులు పొక్లెయిన్ సహాయంతో లారీని రోడ్డు మీదకు యథాస్థితికి చేర్చే ప్రయత్నాలు చేశారు. ప్రతి నెలా ఈ తరహా సంఘటనలు నాలుగు నుంచి ఐదు వరకు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణ సమయంలోనే అనుసంధాన రోడ్డును ఏర్పాటు చేసే క్రమంలో నియమ నిబంధనలను పాటించని కారణంగా వంతెన మలుపు ప్రమాద భరితంగా మారిందని వారు చెబుతున్నారు. ఏలూరు కాలువపై కురెళ్లగూడెం, పాతూరు గ్రామాల వద్ద ఆ గ్రామపంచాయతీలను కలుపుతూ వంతెన లేనందు వల్ల ప్రజలు పడవలపై ప్రయాణం చేసేవారు. 1985వ సంవత్సరం ప్రాంతంలో కాలువ ద్వారా నౌకాయానానికి అనువుగా ఉండే విధంగా ఆ ప్రాంతాల్లో ఎత్తుగా వంతెనలను నిర్మించారు. వాటికి అనుసంధానంగా ఒకవైపు జాతీయ రహదారి, మరొకవైపు ఆయా గ్రామాలను కలుపుతూ అనుసంధాన రోడ్లను ఏర్పాటు చేశారు. ఇదే క్రమంలో ఎత్తుగా ఉండే వంతెన ప్రవేశ మార్గం వద్ద వాహనాలు వెళ్లేందుకు మలుపులను ఏర్పాటు చేయకపోవడం వల్ల వాహనాలు ఎత్తు ఎక్కేందుకు వేగంగా రావడంతో పాటు వెంటనే మలుపు తిరిగి వంతెనపై ప్రవేశించేందుకు చేసే ప్రయత్నాలు ఇబ్బందికరంగా మారాయి. తరచుగా ప్రమాదాలు జరిగేవి. ప్రస్తుతం సైతం కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా బాధ్యులు సంబంధిత సమస్యపై దృష్టి పెట్టి, ఎక్కువ లోడులతో వాహనాలు ప్రయాణించేందుకు రెండు లైన్ల వంతెన నిర్మాణాన్ని చేపట్టడంతో పాటు, వంతెనపై చేరేందుకు ఏర్పాటు చేయాల్సిన అనుసంధాన రోడ్లను సైతం వాటికి అనుగుణంగా నూతనంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంలో డిఎంహెచ్ఒ శర్మిష్ట

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ శర్మిష్ట, హాజరన సిబ్బంది

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం వారు వరల్డ్ మెంటల్ హెల్త్ డేను స్థానిక డిఎంహెచ్ఒ కార్యాలయంలో గురువారం నిర్వహించినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్.శర్మిష్ట తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డబ్ల్యూహెచ్ఒ వారు ఒక థీమ్ ప్రకటిస్తారని చెప్పారు. ఈ ఏడాది పని ప్రదేశాల్లో మానసిక ఆరోగ్యాన్ని ప్రాధాన్యతగా చేయడానికి ఇది మంచి సమయమన్నారు. రోజు వారి పని సమయాల్లో విరామం, విశ్రాంతి అవసరమని, మంచి ఆహారం క్రమం తప్పకుండా ఇవ్వడం, వ్యాయామం చేయడం అవసరమని వివరించారు. మానసిక ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యల వల్ల చిన్న వయసులోనే బిపి, షుగర్, గుండెపోటు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. మన దేశ జనాభాలో 15 శాతం జనాభా మానసిక వ్యాధులతో బాధపడుతున్నారని వివరించారు. ప్రతి ఏడుగురు విద్యార్థుల్లో ఒకరికి తేలిక పాటి నుంచి తీవ్రమైన మానసిక రుగ్మతలు ఉన్నాయని వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా 60 శాతం జనాభా ఉద్యోగులుగా ఉన్నారని, వీరిలో ఎక్కువ మంది మానసిక సమస్యలతో బాధపడుతున్నారని, ఒత్తిడి, ఆందోళన, మానసిక కుంగుబాటు వంటి వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. ప్రతి ఏడాది సుమారు ఏడు లక్షల మందికి పైగా అత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఉద్యోగులతో పాటు ప్రజలకు కూడా మానసిక ఆరోగ్యంపైన అవగాహన కల్పించాలన్నారు. మానసిక వ్యాధుల నుంచి ఉపశమనం పొందడానికి యోగా మెడిటేషన్ శారీరక వ్యాయామం చేస్తూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మానసిక వ్యాధుల చికిత్స, కౌన్సెలింగ్ కోసం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో సంప్రదించాలని తెలిపారు. మానసిక సమస్యలు ఉత్పన్నమైనప్పుడు ఫోన్ ద్వారా ఉచిత ఆన్‌లైన్ కౌన్సెలింగ్ కోసం 14,416 నెంబర్‌కి కాల్ చేయగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎంపి పోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నరేంద్రకృష్ణ, వైద్య ఆరోగ్య సిబ్బంది, డిహెచ్ఎంపి సైకాలజిస్ట్ శ్రీనివాసరావు, సోషల్ వర్కర్ తిరుపతి స్వామి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి అందరూ కృషి చేయాలి

ప్రజాశక్తి - ముసునూరు

గ్రామాల అభివృద్ధికి అధికారులు, నాయకులే కాకుండా గ్రామస్తులు కూడా కృషి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ, పౌర సంబంధాల సమాచార శాఖ మంత్రికొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన కర్రా ఏసుపాదం కుమారుడి వివాహానికి ఆయన హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు టిడిపి రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు, కాట్రేనిపాడు ఎంపిటిసి సభ్యులు సూర్యదేవర నాగమంజుల శ్రీనివాసరావు, ఉప్పలపాటి గణేష్, బుజ్జియ్య, మెదరమెట్ల సురేంద్ర, దేవినేని డలరామ్ పాల్గొన్నారు.

కేంద్రం నిధులు నిర్వాసితులకే ఖర్చుపెట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

పోలవరం ప్రాజెక్ట్ కోసం కేంద్రం కేటాయించిన రూ.2,800 కోట్లు నిర్వాసితులకు పునరావాసం, పరిహారం కోసం ఖర్చు పెట్టాలని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. మండలంలో కొత్తూరు గ్రామంలో కరాటం ప్రకాష్ అధ్యక్షతన గురువారం గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. ముందుగా సిపిఎం సీనియర్ నాయకులు తొండ సీతయ్య జెండా ఎగురవేశారు. అనంతరం సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ శాఖ మహాసభకు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు కోసం సర్వస్వం త్యాగం చేస్తున్న ఆదివాసీలు, గిరిజనేతర నిర్వాసితులకు ఇచ్చే పునరావాసం, పరిహారం విషయంలో నిర్లక్ష్యం చేయటం తగదన్నారు. కేంద్రం ఇచ్చే ప్రతి రూపాయి కూడా ముందు నిర్వాసితుల పరిహారం, పునరావాసానికి ఖర్చు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. మండలం మొత్తం యూనిటీగా తీసుకుని నిర్వాసితులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం మూడు సంవత్సరాల్లో పార్టీ కర్తవ్యాలను, సమస్యలపై పోరాడిన ఉద్యమాలను, శాఖ సభ్యులు పనితీరును సమీక్షించి సమస్యలపై చర్చించారు. రెండోసారి కొత్తూరు గ్రామ శాఖ కార్యదర్శిగా ఊకె రాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ శాఖ మహాసభలో సిపిఎం జిల్లా నాయకులు మడివి దుర్గారావు, మండల కార్యదర్శి ధర్ముల రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రావకృష్ణ, సోడే ప్రసాద్, సవలం లింగయ్య, ఊకె మహాలక్ష్మి, మడివి బుల్లెమ్మ, పూరెం కిట్టయ్య, ఊకె ముత్యాలు, సీతమ్మ పాల్గొన్నారు.

'మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బిజెపి'

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

బిజెపి ప్రభుత్వం దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతుందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోళ్ల పవన్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మతాన్ని కవచంలా అడ్డుపెట్టుకుని దర్జాగా దేశాన్ని దోచుకుంటూ దోస్తులకు సంపదను దోచిపెడుతుందన్నారు. పదేళ్లుగా దేశం వెలుగుతుందని మోడీ పచ్చి అబద్ధాలు చెబుతున్నారన్నారు. హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ మాత్రమే ప్రత్యామ్నాయమన్నారు.

ప్రెస్‌క్లబ్ అధ్యక్షునిగా మధుబాబు

బుట్టాయగూడెం :బుట్టాయగూడెం ప్రెస్‌క్లబ్ నూతన అధ్యక్షునిగా ప్రజాశక్తి బుట్టాయగూడెం మండల విలేకరి గంజి మధుబాబును ఎన్నుకున్నారు.కార్యదర్శిగా మద్రి రమేష్, ఉపాధ్యక్షుడిగా శీలం కృష్ణమోహన్, ట్రెజరరీగా పాముల మురళీకృష్ణ, జాయింట్ సెక్రటరీగా కారం భాస్కర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షునిగా ఎన్నికైన మధుబాబు మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ అభివృద్ధి కి, ప్రెస్‌క్లబ్ సమస్యల పరిష్కారానికి, నిర్మాణంలో ఆగిపోయిన ప్రెస్‌క్లబ్ బిల్డింగ్ పూర్తి చేయడానికి కృషి చేస్తానని చెప్పారు.

ఉచిత న్యాయ సహాయాన్ని వినియోగించుకోండి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

హోమ్‌లో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ గురువారం ప్రపంచ మానసిక విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా స్థానిక తంగేళ్లమూడిలోని మిషనరీ ఆఫ్ ఛారిటీ వారు నిర్వహిస్తున్న హోమ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోమ్‌లో ఉన్న వారికి అందిస్తున్న సదుపాయాల పైన వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న వైద్య సదుపాయాలు, ఆహార సదుపాయాల పైన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వారికి ప్రభుత్వ పథకాలు పొందటంలో కాని, వారికి ఏమైనా ఆస్తులు ఉన్న వాటిని పొందడంలో ఎదురయ్యే న్యాయ సమస్యలపై ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ లాయర్ పి.వెంకటేశ్వరరావు, సంస్థ యాజమాన్యం పాల్గొన్నారు.

ఆసుపత్రి భవన నిర్మాణ పనులు అడ్డగింత

నాసిరకం ఇసుక వాడుతున్నారని కూటమి నేతల ఆగ్రహం

ప్రజాశక్తి - చింతలపూడి

వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణంలో నాసిరకం ఇసుక వాడొద్దని హెచ్చరిస్తున్నా వారి తీరు మారడం లేదు. తోటల్లోని కాలువలో దొరికే ఇసుకతో భవన నిర్మాణం జరుగుతుందని జనసేన, టిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, సూపరింటెండెంట్ హెచ్చరించినా తీరు మార్చుకోవడం లేదని మండి పడుతున్నారు. నాసిరకం ఇసుకతో చేపడుతున్న భవన నిర్మాణ పనులను జనసేన, టిడిపి నాయకులు గురువారం అడ్డుకున్నారు. ఇసుకలో మట్టి కలుస్తుందని, ఈ ఇసుకతో భవనాన్ని నిర్మిస్తే భవిష్యత్తులో ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. భవన నిర్మాణం నాణ్యత పరీక్షించే అధికారులు ఏమయ్యారని ప్రశ్నించారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాసిరకం పనులు జరుగుతున్నాయన్నారు. జిల్లా అధికారులు ఇప్పటికైనా దృష్టి పెట్టాలని కోరారు.

పోలీస్ శాఖ ప్రక్షాళనకు చర్యలు

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ఎంఎల్ఎకు పూలమొక్క అందిస్తున్న ఎఎస్‌పి సూర్యచంద్రరావు

దెందులూరు :గత ఐదేళ్లలో వైసిపి దుర్మార్గపు పాలనలో సామాన్య ప్రజలపై జరిగిన ఎన్నో అన్యాయాలు, అక్రమాలు, దాడులకు కొందరు పోలీస్ సిబ్బంది సైతం అండగా నిలిచి సామాన్య ప్రజల్లో పోలీస్ శాఖపై ఉండే నమ్మకాన్ని నాశనం చేశారని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. అందువల్లే ప్రజల్లో పోలీస్ శాఖపై ఉండే భరోసాను తిరిగి కల్పించేలా టిడిపి కూటమి ప్రభుత్వం రాష్ట్ర పోలీస్ శాఖను సైతం పూర్తిగా ప్రక్షాళన చేస్తూ చర్యలు చేపట్టిందని తెలిపారు. ఏలూరు జిల్లా అదనపు ఎస్‌పి(అడ్మిన్)గా ఇటీవల భాద్యతలు చేపట్టిన నక్కా సూర్యచంద్రరావు గురువారం ఎంఎల్ఎ చింతమనేనిని ఆయన క్యాంపు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో వారి అనుభవాన్ని ఉపయోగించి మెరుగైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు), లావేటి శ్రీనివాస్, బొప్పన సుధ, నంబూరి నాగరాజు, పార్టీ నాయకులు తాతా సత్యనారాయణ, పర్వతనేని రామకృష్ణ, (సీతంపేట), జమలయ్య పాల్గొన్నారు.

పంచాయతీ స్థలాల ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ముసునూరు

ప్రభుత్వ స్థలాలను ఆక్రమణదారులు ఆక్రమించుకుని వ్యాపారం చేసుకుంటూ ప్రజల అనారోగ్యానికి గురవుతున్నారని రమణక్కపేట గ్రామస్తులు ఎంపిడిఒ జి.రాణికి గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని రమణక్కపేట పంచాయతీ పరిధిలోని కండ్రిక ఏరియాలో ప్రభుత్వ స్థలంలో కొంతమంది లైవ్ ఫిష్, చికెన్ షాపులు ఏర్పాటు చేసుకుని వ్యాపారం కొనసాగిస్తున్నారన్నారు. దీంతో చేపలు, కోళ్ల వ్యర్థాలతో ఆ పంచాయతీ బోరు నీరు కలుషితమవ్వడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ఆది, గురువారాల్లో దుకాణాల వద్ద బైక్‌లు, సైకిళ్లు, కార్లు అడ్డదిడ్డంగా పెట్టడంతో మహిళలు నడిచే పరిస్థితి లేదన్నారు. గ్రామస్తులు, ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ గ్రామ విద్యార్థులైన గణేష్, అఖిల్, నాగరాజు, ఏసు, కిరణ్ కలిసి ఎంపిడిఒకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంపిడిఒ స్పందించి ప్రభుత్వ స్థలాలు ఎవరైనా ఆక్రమించినట్లయితే వారిపై పోలీసు వారు బందోబస్తుతో కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రమణక్కపేట గ్రామంతో పాటు, మండల పరిధిలో ఎవరైనా సరే పంచాయతీ స్థలాలను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P. No. 45/2018 in OS. No. 183/2008

Between:

గబ్బిడి స్వామి ...డిక్రీ హోల్డర్స్

Vs

అందే వీర వెంకట రామచంద్రరావు ...జడ్జిమెంట్ డేట్టార్ టు

అందే వీర వెంకట రామచంద్రరావు
S/o రాఘవరావు, వయసు 45 సం.రాలు
కే.పి.పాలెం, మొగల్తూరు, మొగల్తూరు మండలం.

పై నెంబరు EP గ్రంథములో జడ్జిమెంట్ డేట్టార్ యొక్క ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని **ది. 21-10-2024వ తేదీన ఉ.గం. 10-30 ని.ల** లగాయతు పైన తెలిపిన కోర్టు నందు వేలం ద్వారా విక్రయించబడును. కావున కావలసిన వారు వేలంలో పాల్గొని క్రియం పొందగలరు.

షెడ్యూలు

Item.No.1: పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు సబ్-రిజిస్ట్రారులో చేరిన నరసాపురం మండలం, లింగబోయినచర్ల గ్రామం లో గల **రి.స.నెం.434/8** లో గల య **2.54 సెంట్లు జిరాయతీ మెరక భూమి** మరియు **రి.స.నెం.434/10** లో గల య **60 సెంట్లు జిరాయతీ మెరక భూమి** ఏకప్రతిగా ఉన్నందున రెండు ప్రతులు య **3-14 సెంట్లు భూమికి హద్దులు.**

తూర్పు : మెరక గాయలు
పడమర : ఉప్పల సత్యనారాయణ గారి భూమి
దక్షిణము : రైతు సేద్యం
ఉత్తరం : గవర్నమెంటు పుంత

అమీనా విలువ Rs. 7,85,000/-
D.H.R విలువ Rs. 8,40,000/-
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

యం. వెంకట రామిరెడ్డి
పాలకొల్లు అడ్వకేటు
ది.8-10-2024 పాలకొల్లు:

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో,

Creditor I.P. No. 20/2022

Between:

పిటీషనరు: బొంతు ఆదినారాయణ S/o సత్యనారాయణ, రావిగొప్పు గ్రామం, పోడూరు మండలం, ప.గో.జిల్లా.

రెస్పాండెంట్లు:

R1. జుత్తిగ రుక్మిని, W/o తెలుగురాజు, రాయప్ప నగర్, గుమ్ములూరు గ్రామం, పోడూరు మండలం, ప.గో.జిల్లా.
R2. జుత్తిగ దుర్గా ప్రసాద్, S/o తెలుగురాజు, రాయప్ప నగర్, గుమ్ములూరు గ్రామం, పోడూరు మండలం, ప.గో.జిల్లా.
R3. జుత్తిగ గణేశ్వరరావు, S/o తెలుగురాజు, రాయప్ప నగర్, గుమ్ములూరు గ్రామం, పోడూరు మండలం, ప.గో.జిల్లా.
R4. జుత్తిగ వెంకట సత్యనారాయణ, S/o తెలుగురాజు, రాయప్ప నగర్, గుమ్ములూరు గ్రామం, పోడూరు మండలం, ప.గో.జిల్లా.
R5. సామన వరలక్ష్మి, W/o సత్య జగన్నాధరావు, డోర్ నెం. 51-7-13, రామారావు పేట, పాలకొల్లు, ప.గో.జిల్లా.
R6. ఆఫీసర్ రిసీవర్, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు.

పై నెంబరు గ్రంథములో పిటీషనరుకు జుత్తిగ తెలుగురాజు ప్రోనోటు బకాయి ఉన్నందున ఆ ప్రోనోటు బకాయి పరిష్కారం కాకుండా జుత్తిగ తెలుగురాజు 5వ రెస్పాండెంట్ తో కుమ్మకై **ది. 24-03-2021 వ తేదీన క్రియ దస్తావేజు నెం. 2133/2021** ను నామమాత్రం గా వ్రాయటం జరిగింది. అయితే జుత్తిగ తెలుగురాజు చనిపోయినందున, రెస్పాండెంట్లు నెం. 1 టు 4 అతని వారసులు అయినందున **ది. 24-03-2021 వ తేదీన** నామమాత్రంగా వ్రాసిన **క్రియ దస్తావేజు నెం. 2133/2021** ను రద్దుచేయవలసినదిగా పిటీషన్‌ను పిటీషనరు కోర్టులో వేసినందున ఈ విషయాన్నీ ఈ ప్రకటన ద్వారా తెలియజేస్తున్నాము.

డి. సుబ్రహ్మణ్యం
వాయిదా తేది: 28-10-2024
అడ్వకేట్, పాలకొల్లు
సెల్: 98491 73674

In The Court Of The Civil Judge (Senior Division) Tanuku

I.P No. 22/2024

Between:

Penugonda Satyanarayana, S/o. Venkateswara Rao, D.No.2-88, Gummampadu Village, Attili Mandal, W.G.District ...*Petitioner*

and

1. Mattu Nagaraju, S/o Kanna Rao, D.No.2-55, Gummampadu Village, Attili Mandal, W.G.District.
2. Allu Srinu, S/o Kanaka Rao, D.No.2-26, Gummampadu Village, Attili Mandal, W.G.District.
3. Marutu Satyam, S/o Notknown, D.No.2-72, Gummampadu Village, Attili Mandal, W.G.District.
4. Yalla Nagaraju, S/o Palla Rao, D.No.2-67, Bank Street, Gummampadu Village, Attili Mandal, W.G.District.
5. Visanasetti Govinda, S/o Appalanaidu, D.No.2-55, Gummampadu Village, Attili Mandal, W.G.District.
6. Mamsamkottu Narsim, S/o Notknown, D.No.2-32, Gummampadu Village, Attili Mandal, W.G.District.
7. Venukonda Pedda Nagayya, S/o Venkatarao, D.No.2-95, Gummampadu Village, Attili Mandal, W.G.District.
8. Voruganti Pitcheswararao, S/o Nageswara rao, D.No.2-55, Chennuru Post, Pedana Mandal, Krishna District.
9. Yerravarapu Apparao, S/o Satyanarayana, D.No.1-77, Gutlapadu Village, Bhimavaram Mandal, W.G.District.
10. Yerravarapu Trimurthulu, S/o Venkata Lingam, D.No.3-96, Padatadiki Village, Kruthivennu Mandal, Krishna District.
11. Barreti Lakshmanna, S/o Notknown, D.No.2-40, Gummampadu Village, Attili Mandal, W.G.District.
12. The Official Receiver, W.G.District., Bhimavaram

GENERAL NOTICE

పై గ్రంథము నందు పిటీషనర్ను ఇన్సాల్వెంట్ గా డి డిక్లేయిర్ చేయమని కోరుచూ పిటీషనరు శ్రీ కోర్టు నందు పై గ్రంథము పిటీషన్ దాఖలు చేసినందున అందు విషయమై ఎవ్వరికి ఎట్టి అభ్యంతరములు ఉన్న యెడల **ది. 25-10-2024వ తేదీన ఉదయం 10-30 నిమిషాలకు** పై కోర్టు వారి ఎదుట హాజరై వారి అభ్యంతరములు తెలుపుకొవలసినదిగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

బేతిరెడ్డి నాగ సృజన
తణుకు పిటీషనర్ తరపు అడ్వకేట్
ది.10-10-2024 సెల్: 81062 77443